# నిరీక్షణ

## సురవరం ప్రతాపరెడ్డి

రాయచూరు జిల్లా, అలంపురం తాలూకా ఇటికేలపాడులో జన్మించారు. బి.ఏ.బి.ఎల్. చదివి, హైదరాబాదులో గోల్కొండ పత్రికకు దాదాపు 20 సంవత్సరాలు సంపాదకులుగా పనిచేశారు. నిగర్వి, నిరాడంబరుడు, నిర్భయుడు. పలు సంపాదకీయాలు, వ్యాఖ్యలు, వ్యాసాలు వెలువరించారు. చక్కని కథలు రాశారు. ప్రతాపరెడ్డి కథల సంపుటి వెలువడింది. "శుద్ధాంతకాంత" నవల, తుకారాం నాటకము రచించారు. పలువురి జీవిత చరిత్రలు రాశారు. సంస్కృత, ఉర్దూ, ఆంగ్ల భాషలలో ప్రవీణులు. రెండు నెలలకు తుదిశ్వాస విడుస్తారనేదాకా, నిర్విరామంగా ఆయన రచనలు చేస్తూనే వున్నారు. చివరి కొద్ది వారాలు వారి స్వగ్రామంలోనే గడిపారు. సురవరంది ఒక శకం.

---

"**శం**కరన్! దినమూ సూర్యుడు తూర్పు సముద్రము నుంచి పైకి లేచి మళ్ళీ పడమటి సముద్రములో మునుగుతూ వుంటాడు. రాత్రంతా యెక్కడ వుంటాడు? మళ్ళీ తెల్లవారేవరకు తూర్పు కెట్లా వస్తాడు?"

"కుమారీ! అది అనాది నియమం. ప్రతి వస్తువుకూ ఉదయం అస్తమయం ఉన్నది. అస్తమించే వస్తువు మళ్ళీ ఉదయిస్తుంది. మన యీవూర్లో తూర్పు పడమటి సముద్రాలు కలుస్తవి. అందుచేత సముద్రంలోనే పుట్టి సముద్రంలోనే మునిగినట్లు కనబడుతుంది."

"అయితే వేరే దేశాల్లో ఎట్లా వుంటుంది?"

"ఈ అందం అక్కడలేదు. ఉత్తరానికి పొయ్యే కొద్దీ భూమిలో మునిగి, భూమిలో నుండి పైకి వచ్చేటట్లు కనబడుతాడు."

"ఆ అలలు చూస్తివా? యెట్లా వొకటిమీద వొకటి పడుతున్నవో. ఎప్పుడూ వాటికి విరామం లేదా?"

"అఖండ ప్రేమ అంటే అట్లే వుంటుంది... ఈ ముచ్చట్లకేమి గాని యింక కొంచెం సేపట్లో సూర్యుడు మునుగుతాడు. మనము దినములాగా యిక్కడ నుండి సముద్రం అంచువరకు దొర్లుదాము, రా"

"ఊహూఁ దినమూ నేనే ముందు దొర్లా లేమి? చూడు, ఎంతయెత్తు నుండి దొర్లుతామో? 40 అడుగుల ఎత్తయినా వుంటుంది యీ యిసుక దిబ్బ!

"నీవే ముందు దొర్లాలె."

"లేదు, నీవే"

"సరే, రా!"

శంకరన్ ముందు ఆ ఏటవాలు సముద్రతీరం యిసుకదిబ్బ మీద అడ్డము పండుకొని పల్టీలు కొడ్తూ కిందికి దొర్లినాడు. కుమారి వాని వెనుకాలనే దొర్లింది. శంకరన్ మీద కుమారి పడింది. కిలకిలా నవ్వుతూ ఇసుకంతా దులుపుకొని చేతులు చేతులు పట్టుకొని మళ్ళీ పైకెగబాకినారు. ఇట్లా ఎన్నోమారులు దొర్లినారు. ఇంతలో ప్రొద్దు మునిగింది. ఇద్దరూ ఒకర్నొకరు రాచుకుంటూ యింటిదారి పట్టినారు.

❖ ❖ ❖

శంకరన్ తల్లిదండ్రులు చిన్నప్పుడు చనిపోయినారు. తన మేనమామ యింట్లో పెరుగుతున్నాడు. ఇప్పటికి వయస్సు 15 వుంటుంది. మంచి స్ఫురద్రూపి. సాధారణంగా తిరువాన్కూరు బెస్తవారు అంటే నల్లగా వుంటారు. కాని శంకరన్ గోధుమ వర్ణము

## ఆణిముత్యాలు

వాడు. దినమూ ఆ కన్యాకుమారి తీరమువద్ద సముద్రములో తన మేనమామ వెంటపోయి చేపలు పట్టుక వచ్చేవాడు. కుమారి తలిదండ్రుల కొకే కూతురు. వయసులో చిన్నదైనా చేపల కూర, అరటికూర, పనసకూర, అన్నము, సాంబారు బాగా వండగలదు. మంచి అందమైన పిల్ల. కాస్త నల్లనిదైనా ముక్కు మొగమూ తీరూ చూచిన చాలా ఆకర్షణీయముగా కనపడేది. కొబ్బరి నూనెతో నిగనిగమనే వెంట్రుకలు అప్పుడే బారెడేసి పెరిగినవి. నల్లని పెద్దకండ్లతో నవ్విందంటే శంకరన్ హృదయంలో మెరుపు మెరిసినట్లు వుండేది.

పెదవి తెరచి మాట్లాడిందంటే ఏక్తారా విన్నట్లు వినే వాడు. బయలులో తిరిగే గారాబముగా పెరిగిన పిల్ల కావడంచేత అంగసౌష్టవం బాగా వ్యక్తం అవుతూ వుండేది. తన మేనమామ కూతురు అవడంచేత శంకరన్‌కే ఆ పిల్లనిస్తారని అందరూ అనుకునేవారు. కాని వీరికా పెండ్లిండ్ల ముచ్చట యేమిన్నీ తెలియదు. అన్యోన్య ప్రేమ దినదినమూ పెరుగుతూ వుంది. దినము సాయంకాలమూ తప్పకుండా సముద్ర తీరము పైన ఆ యేటవాలు యిసుక దిబ్బలమీద ఆడుకునే వారు.

ఇట్లా కొన్ని సంవత్సరాలు గడచినవి. శంకరన్

## ఆశల చకోరం

మనసు పందిరికి అనుభూతుల లతల్లా
అల్లుకొని తలపులలో నిండిపోయావు నేస్తం!
సెలయేటి ఒడ్డున ఏకాంతంగా మనంఆడుకున్న ఊసుల్ని
ఓరగా గమనించి గుసగుసలాడుకొన్న అలలు
నా కలలలో కదలాడుతునే ఉన్నాయి
వెలుగు జిలుగుల తైలవర్ణ చిత్రంలా ఉంటుంది నీ జ్ఞాపకం
పారిజాతపు చెట్టు ఒక్కో పూవు రాలుస్తున్నట్లు
ఒక తీయని స్వప్నం విప్పారుతున్నట్లనిపిస్తోంది
నీవు గుర్తుకు వస్తే
నీ గురించి ఎన్ని అనురాగాల అగరొత్తులు
వెలిగించుకున్నానో
గుండె గోడలపై ఎన్ని మమతల శిల్పాలు చెక్కుకున్నానో
మదిలో కొలువైన నీ ప్రతిమను
ఎన్ని ఊహల రంగులతో రమ్యంగా తీర్చిదిద్దుకొన్నానో
నా హృదయ మందిరంలోకి ఒక్కసారి వచ్చిచూడు
మా ఇంటి పెరట్లో విరబూసిన విరజాజులు
పరిమళాల జల్లులతో నిన్ను ముంచెత్తాలని
ఆర్తిగా నీ రాక కొరకు ఎదురు చూస్తున్నాయి
నింగిలో విచ్చుకొన్న ఇంద్రధనుస్సు
నేలకు దిగివచ్చి నిను అల్లుకపోవాలని తపిస్తోంది
ఎద లోయల్లో ఆప్యాయతా ఊటలతో
ప్రవహిస్తున్న ప్రేమ సరోవరంలో కవితల నావల్లో
నీతో విహారం చేయాలనిపిస్తోంది
నీ రాక కొరకు నా మనస్సు
ఆశల చకోరంలా ఎదురు చూస్తోంది

-గోపాలుని వెంకటేశ్వర్లు

ఇరువదియేండ్లవాడైనాడు. కుమారి 16 యేండ్లదైంది. ఈ నవ యవ్వనంలో కుమారి సంపూర్ణ వికాసముకు వచ్చింది. ఆ గులాబి రేకుల వంటి పెదవులు, ఆ నవ్వే పెద్ద కన్నులు ఆ చూపులలో గాఢమైన ప్రేమ, ఆ కిలకిల నవ్వులలో వెన్నెలతేట, ఆ మాటలలో అమాయకత్వము, ఆ గంభీరమైన నడక, ఆ ముందరి కొప్పు, ఆ పొంకమైన వక్షస్థలము శంకరన్ మనసులో గాఢముగ నాటుకొనిపోయినవి. ఆ కాలంలో మళయాళ స్త్రీలకు ఎదలపైన రవికలు గాని, కొంగు గాని లేకుండేవి. అందుచేత కుమారి సౌందర్యం మరీ ఆకర్షణీయమై, లోభనీయమై వుండేది. ఇట్లు వీరిరువురు పెరిగినా, తాము దినమూ ఆడుకునే ఆటలు మానలేదు. ఆ దిబ్బలపైన జారి తనమీద కుమారి పడినప్పుడు శంకరన్ తననే కాదు, ప్రపంచాన్నే మరచిపొయ్యేవాడు. ఆ పడుచు చేయి పట్టుకొని రాత్రిలో ఇంటికిపోతూ వుంటే శరీరమంతా గగుర్పొడిచేది. కుమారి కూడా శంకరన్ తొడపై తలమోపి పండు వెన్నెల్లో పండుకున్నప్పుడు, తన ప్రియుడు ఆ కథా యీ కథా చెప్పుతూ యేదో మిష పెట్టుకొని వంగి ముద్దు పెట్టుకున్నప్పుడు తన శరీరములో రక్తము మహా వేగంగా, ఉష్ణంగా ప్రవహించుతూ వుండేది. చెక్కిళ్ళపైన కాంతి రెండింతలయ్యేది. ఊర్లో అమ్మలక్కలు వీరిద్దరి యీడూ జోడూ చూచి, వీరి అమాయికపు ఆటలు పాటలు చూచి చాలా ముచ్చటపడుతూ పావురాళ్ళ జతలాగా వున్నారని అంటే యిద్దరూ ముసిముసి నవ్వులు నవ్వుతూ వకర్నొకరు వంక చూపుల్తో చూచుకునేవాండ్లు.

ఒకనాడు సాయంకాలము ఇంటికి వస్తూ వారిద్దరూ యిట్లా మాట్లాడుకొంటూ పోయినారు.

"కుమారీ, ముందు ఆదివారము మనకు పెండ్లంటగా! అత్తమామలు వాండ్లు పందిళ్ళేసి యిల్లంతా అలంకారం చేస్తున్నారు."

"ఆ సంగతి నాకూ తెలుసునులే!"

"మనము ఇంక ఆలుమగండ్లమైతే మనకు బ్రహ్మానందంగా ఉంటుంది కదూ!"

"ఇప్పుడు లేదా? మనకెప్పుడూ నిత్యానందమే. మనము ఎప్పటివలెనే దినమూ ఆడుకుంటాముగా!"

"లేదు, ఇంక మనకు ఆట్లాడే అవకాశం వుండదు. మన మింక ఇంటి పనులన్నీ చక్కబెట్టుకుంటూ సంసారం చేయవలసింది. నేను దినమూ చేపల్లు పట్టుక వస్తాను. నీవు యింట్లో పనులన్నీ చక్కబెట్టూ ముసలి

తల్లిదండ్రుల సేవ చేయవలసి వుంటుంది."

"అట్లైతే నీవు నన్నింక ప్రేమించవూ?"

"ప్రేమించనూ? యెవరంటారు? నిన్ను పూలల్లో పెట్టి పూజిస్తాను. అందరిచేతా పూజ జేయిస్తాను."

"ఏమో?"

"నేను పగలంతా చేపలు పట్టబోతాను. నీవు యింట్లో దంచీ, చెరిగి, వంట చేసి, యింటి పనులు చూసుకొని సాయంత్రమువరకూ సద్దీ, బుట్ట తీసికొని సముద్రతీరానికి రావూ?"

"తప్పకుండా, గంట ముందే వచ్చి ఎదురు చూస్తూ కూర్చుంటాను."

"మరి నేను పగలంతా సముద్రంమీద వుంటే నీవు యింటి పనుల్లో నన్ను మరచిపోతావా?"

"ఎన్నటికీ మరవను. అమ్మో! నిన్ను మరిస్తే ప్రపంచమే మరచినట్లు!"

❖ ❖ ❖

శనివారమునాడు మధ్యాహ్నము భోంచేసుకొని కుమారిని వెంటబెట్టుకొని సముద్ర తీరానికి శంకరన్ పోయినాడు.

"కుమారీ! కులాచారం ప్రకారం మన పెండ్లి కోసం నేను వంటిగా పోయి యేదుచేపలైనా పట్టుకొని రావాలె. అదెంతపని! గంట లోపలనే వస్తాను. రేపేగా మన పెండ్లి నీవు యింటివద్ద వుండు ఇప్పుడే వస్తానూ, ఏమి?"

"గట్టిగా వస్తావా?"

"అందుకు సందేహ మేమిటి?"

"చేపల యేటలో నన్ను మరచిపోతావేమో?"

"లేదు, లేదు నీవే నన్ను మరచిపొయ్యేవు!"

"నీవు జల్దీ రాకుంటే, నేను నీతో యింక మాట్లాడను చూడు!"

"తప్పకుండా వస్తాను"

అంటూ శంకరన్ కుమారిని ముద్దులలో ముంచి చిక్కని బిగి కౌగిటిలో ఇరికించుకొని కొంతసేపు తన్మయుడై విడిపించుకొని గంతులు వేస్తూ తెప్ప యెక్కి గబగబా నదుపుకుంటూ వెళ్ళినాడు. అతడు చూపుమేర నుండి అదృశ్యుడయ్యే వరకూ చూస్తూ కుమారి యింటివైపు తిన్నగా నడిచింది, గంట అయింది; రెండు, మూడు, నాలుగు గంటలైంది. సాయంత్ర మైంది. చీకటి పడింది. శంకరన్ రాలేదు. వెన్నెల రాత్రి పర్వాలేదు. ఈవేళ చేపలు దొరకలేదేమో సగము రాత్రికైనా వస్తాడులే" అని కుమారి తల్లిదండ్రులన్నారు.

## దారి చూపే దీపం

ఆధునిక కవితా పితామహుడు
నవయుగ వైతాళికుడు
'దిద్దుబాటు'లో వచన రచన దిద్ది
'ముత్యాలు' ఏరి 'సరాలు' కూర్చిన ధ్రువతార
ప్రతి పలుకులో
వెలుగు దనం తీపినొలికించిన అక్షయధార
పూర్ణమ్మ- కవితా శిల్పం
చెదలు పట్టుచు, చెక్కు చెదరదు
కాసు కోసం కన్నె గొంతులు కోయకండనే సందేశం
ప్రజల గుండెల్లో ఎప్పటికీ చెరగదు
గిరీశాల కథ 'కన్యాశుల్కం'తో
అద్దం తిరిగిన వైనం సమాజానికే మార్గదర్శకం
గుండె లోతుల్లోంచి ఎగసిపడే కెరటం
'ముఖర్జీ' గారి పత్రికకే మకుటం
వ్యావహారికం ఆయన రచనల్లో
అపూర్వ పరిమళాలు విరజిమ్మింది
విజయనగరం మాండలికం
రా.వి.శాస్త్రి, కా.రా.ల రచనల్లో కమ్ముకుంది
ఆనాడు లోకం నిందించింది
ఈనాడు జాతి మొత్తం నీరాజనాలందించింది
మాత్రాచ్ఛందస్సులో కొత్త పుంతలు తొక్కాడు
'చంద్రశేఖర' దృష్టిపథంతో/'సారంగధర' సృష్టి విధంతో
అందరికీ ఆహ్లాదమందించాడు
ఆనంద గజపతికి పత్రికా పఠనంతో
అపూర్వ ఆనందమందించాడు
సాహిత్యంలో 'హ్యూమర్'కి మేడకట్టాడు
'నేటివిటీ'కి నీడనిచ్చాడు
'బిల్హణీయం'తో బిరుదు మగడై
'కొండు భట్టీయం'తో కోటి కొక్కడైనాడు
పుట్టుగుణంతో, మట్టిగుణంతో
మెట్టు మెట్టుకీ ఎదిగి
సాహితీ కేదారాన్ని పండించాడు
హాస్యానికి కన్నీటి రహస్యాల్ని జోడించాడు
అప్పారావు ఆణిముత్యం/జాతికి అనర్ఘ మణిరత్నం
'మిణుగురు' లాంటి 'మనిషి'కి 'వెలుతురు' పెంచాడు
గ్రాంథిక భాషా సంగ్రామంలో
వరుడైన గిడుగుకి నారాయణుడై నడిపించాడు
ఊపిరివాయులీనమై/విజయనగరం విషాదమైనవేళ
ఆ రూపం దీపంగా మారిపోయింది
అజరామరుడైన ఆయన వెలుగు
లోకమంతా నిండిపోయింది.

-డా॥ కె.సుందరలక్ష్మి

## సినీవాలి

దర నిమీలిత దివ్య నేత్రాలతోడ
గాఢ ప్రేమానుభావ సంకలిత హృదయ
అరుణ రాగావ కుంఠనాంతరము నుండి
వేకువ నెలంతయై నవ్వు విసరుచుండె;
భావపథమందు జాజ్జ్వల్య భాస్వరమ్ము
గుండె పరిచిన వెలుగుల గుస్తరింపు
కటిక చీకటి దారుల కాంతి ధార
వేగు తూరుములెత్తిన వేల్పువాక
కలిమి చిన్నెలు చిగురించి కళలనేచు
కాంతిపూవుల గుత్తికి కడిమిచెట్టు
నెగడు నిట్టూర్పు గాలుల సెగలు మాయ
నలిని చేయెత్తి పిచిన చెలిమి కొమ్మ!
ఈయుషఃకాల శీతావాతోర్మిలేచి
పవలు యిహమిచ్చి ప్రవహించి పరమువైపు
నా మనసు లోతులను శారదా మనోజ్ఞ
చరణ మంజీర దీపికా సంధ్య మొరసె!
చుక్కలొక్కటొక్కటిగను చేరుచుండె
చివరికొక గుండెలోతు పూచినది వంపు
రూప రహిత వియద్ఘుణ ప్రోజ్జ్వలదణు
సమితి నా సినీవాలి శ్రీచంద్రరేఖ!!
ఈనిభృత పవిత్రమ వాస్య మీ నిశా ప్ర
శాంత శ్రీ కాలనాథ పూజా సమయము
నందు అగలింటి మొగసాల నాశపడుచు
నా ప్రదీపము వెలిగించి నాను-గుండె...
అంద మెగబోయు లావణ్య మంటు గొలిపి
దీపకళిక సరవిని తోరణించి
అస్ఖలితమైన కన్నె సోయగపు ఛాయ
నక్త ముఖవేది కైరవి నాట్యమాడె...
కలకలన్ నవ్వులటులుండు; కన్నులెత్తి
నిష్కలి షితాంతరంగంబు నీడజూపు
ముగ్ధమోహన లావణ్య మూర్తితోచు
కదలినపుడెల్ల దీపికగా మలక...
నరక లోకపు చీకటి తెరలు దీసి
స్వప్న దీపము నందించె సత్యభామ
కన్న తల్లి దీవెన కాంతి కౌగిలింత
పండు వెన్నెల లలమె బ్రహ్మాండమెల్ల...
అంతరాంతర నైశీథ్యమంతరించి
నిఖిల వర్ణ సుందరతర నైజమొరసి
అనిల వీచికా స్థంభన మాచరించి
పసిడి కాంతిగ కంటిలో బాహిరిల్లె!
చిమ్ము యెగజిమ్ము ముత్యాల చిచ్చుబుడ్లు
వెలుగు గుండియ పండించు వెన్నముద్ద
కడిది మినుకుల నొలికించు కాకరొత్తి
కట్టి నీవేళ పుడమికి కాంతివేల
నిబిడ తిమిర జగతికి సందీప్త రేఖ
అతివ అబలకాదు సబలయను పతాక
స్వప్నజీవుల ముత్యాల స్వర్ణలేఖ
దివ్య దీపావళి మహిమ దివికిజోక!! —సాంధశ్రీ

కుమారి మాత్రము రాత్రి అన్నము తినలేదు, నిద్ర పోలేదు; యింటి ముందరనే కూర్చుని సముద్రము దిక్కు చూస్తూ వున్నది. ఏమాత్రము చప్పుడైనా తన శంకరన్నే వచ్చెనని ఆత్రముతో చూస్తూ వున్నది. తెల్లవారే వరకూ ఒకటే నిరీక్షణ. కుమారి తల్లిదండ్రులు భయపడిపోయినారు. వెంటనే కులస్థులను పది మందిని జతచేసుకొని తెప్పలు వేసుకొని సముద్రము మీద ప్రయాణమైనారు. పదిమంది పది దిక్కులా పోయి నారు. మధ్యాహ్నానికి అందరూ వాపసు వచ్చినారు. శంకరన్ చనిపోయినాడనే నిర్ణయించుకొన్నారు. కాని తెప్పజాడైనా కనపడవలసి వుండె. అదీ దొరకలేదు. వృద్ధులైన కుమారి తల్లిదండ్రులు కుమారిని పట్టుకొని గోడుగోడున యేడ్చినారు. వచ్చిన చుట్టాలంతా అంగ లార్చినారు. ఎవ్వరికి తోచినట్లు వాళ్ళు ఓదార్చినారు.

"యిద్దరికీ లగ్నబలం లేదు. ఏమి చేస్తాము?"

"యిద్దరూ పార్వతీ పరమేశ్వరులలాగా ముచ్చటగా వుండేవారు. పాపం!"

"వానికి నొసటిమీద వుండే ఆ పెద్ద మచ్చను చూచి ఎంత అదృష్టవంతుడమ్మా అనుకుండే వాండ్లము!"

"ఎంత వినయ విధేయతలనుకొన్నారు!"

"శంకరన్ అంటే భోళాశంకరుడేనమ్మా!"

"ఇంకెక్కడి శంకరన్! అయ్యో! కుమారీ! మీ యిద్దరికి యీనాటికి ఋణానుబంధము తెగిపోయె గదమ్మా!"

అని నానావిధాల యెవరికి తోచినట్లు వారు వాపోయినారు.

కాని కుమారి మాత్రం ఒక్క కన్నీటి చుక్క కార్చలేదు. ఒకమాట అనలేదు. ఒకవిధమైన విషాద హాసముతో సముద్రం దిక్కే చూస్తూ వుంది. ఎవరు పిలిచినా పలుకదు, అన్నము తినదు, ఆ చూపులో ఏదో వెదుకులాట కనపడుతూ వుంది. వచ్చిన బంధువు లంతా సాయంత్రం వరకూ ఎవరి బాట పట్టుకొని వారు పోయినారు.

అస్తమానం అయ్యే సమయంలో యింత చేపల కూర, ఇంత అన్నము, యింత పెరుగు, బుట్టలో తీసి కొని కుమారి సముద్రతీరానికి పోయింది. ఎందుకమ్మా అంటే పలకదు. తల్లిదండ్రులు అడ్డము వచ్చినా వినదు. శంకరన్ తనను విడిచి యిప్పుడే వస్తానని చెప్పి కడసారి ముద్దుపెట్టుకొని కౌగిలించుకొన్న చోటికేపోయి నిలుచున్నది. అట్లే సముద్రం దిక్కు చూస్తూ నిల బడింది. తల్లిదండ్రులు ఏమి ప్రమాదమౌతుందో అని

వెంటనే వున్నారు. చీకటి పడ్డ తర్వాత ఎంతో ప్రయాసతో యింటికి తీసుక వచ్చినారు. ప్రతి దినమూ సాయం కాలము సద్ది కట్టుకొని కుమారి సముద్ర తీరానికి పోయి నిలుచుండి చీకటి పడిన వెంటనే తిరిగి యింటికి వచ్చేది.

"ఏమమ్మా! ఇంకెక్కడి శంకరన్! ఇంకా వస్తాడను కున్నావా? ఎందుకు వృథా శ్రమ?" అని తల్లిదండ్రులు కంట నీరు పెట్టుకొని అడిగితే-

"అమ్మా! నా ప్రియుడు, నా ప్రాణము, నా శంకరన్ తప్పక వస్తాడే! తప్పకుండా వస్తానని చేయిలో చేయి వేసి పోయినాడు" అనేది కుమారి.

"ఓసి పిచ్చితల్లీ! ఇవెక్కడి పిచ్చి ఊహలే నీకు!"

"లేదమ్మా! తప్పకుండా వస్తాడు. పోతూ పోతూ నన్ను మరచిపొయ్యేవు సుమా అని చెప్పిపోయినాడు."

"వాడే నిన్ను మరచిపోయినాడే, తిక్కతల్లీ! యింక వాని ఆలోచన విడిచిపెట్టు."

"అట్లా కానే కాదు. అతడు నన్నెన్నటికీ మరచి పోడు. నన్ను పూలల్లో పెట్టి పూజిస్తా నన్నాడు. ఆ అలలవలెనే ప్రేమ అనంతము, అఖండము అన్నాడు."

"బిడ్డా, నీకు మతిపోయిందా ఏమి! వేరే మంచి మనుము చూస్తానులే. చింత చేయవద్దు" అన్నాడు తండ్రి.

"నా శంకరన్ కంటే మంచివాడు ప్రపంచమంతా వెదకినా దొరకడు. నా శంకరన్ తప్పకుండా వస్తాడు, నా పెండ్లి విషయంలో మీరేమీ చింత చేయవద్దు. చిన్నప్పుడే మాకిద్దరికీ పెండ్లి అయ్యింది. నేనిట్లే యెదురు చూస్తుంటాను. మీకిష్టం వుంటే ఇంత కూడు వెయ్యండి. లేకుంటే నేనూ సముద్రం మీద పోయి నా ప్రియుణ్ణి, నా భర్తను వెదుక్కొని కలుసుకుంటాను.

❖ ❖ ❖

కొన్ని యేండ్లు అట్లే గడిచిపోయినవి. కుమారి తల్లిదండ్రులు క్రమేణా చనిపోయినారు. కుమారి కిప్పుడు దిక్కెవ్వరూ లేరు. తల్లిదండ్రులు విడిచిపెట్టి పోయిన ఆస్తి కావలసినంత వుంది. దినమూ తనకూ, తన శంకరన్‌కూ వంట వండుతుంది. సాయంత్ర మయ్యే వరక శంకరన్ భాగము మూట కట్టుకొని సముద్ర తీరం పోయి, తాము చిన్నప్పు డాడుకొన్న చోట్లన్నీ తిరిగి చీకటి పడేవరకు శంకరన్ ఆఖరుసారి తనను విడిచిపెట్టిపోయిన తావుకు పోయి అక్కడ అన్నము పెట్టి యింటికి వస్తుంది. ఇట్లా దినాలు, మాసాలు, సంవత్సరాలు గడుస్తూ కుమారికి 60 ఏండ్లు

## సాగరతరంగాలు-నానీలు

జీవనదియైన
గోదావరి జలధార
అది మాకు
అరుంధతీ తార.

ఒకనాడు తెలంగాణ
అన్నపూర్ణ
నేడు అది
బాధల సంకీర్ణ.

చెరుకు రసం
చప్పబడ్డదా!
అయితే పోతన భాగవతం
చదివుంటావు.

ఆచరణాత్మకం కాని
ఉపదేశాలు
కాల ప్రవాహంలో
నిరవశేషాలు.

అత్తగారింట్లో
అల్లుళ్ళ పెత్తనం
ఇదోరకమైన
తీవ్రవాదం.

పరీక్షలంటే
విద్యార్థులకు కాదు భయం
పర్సంటేజితో
గురువులకూడా.

సమదర్శి అయినవాడే
పండితుడు
పదకోశం
తెలిసినవాడు కాదు.

శ్రీకారంతో
కావ్యారంభం చేస్తే
అమంగళ
పరిహారణకు స్వస్తి

విజయసారథి
సంస్కృత వాఙ్మయంలో
నీరధి
జాతీయతకు వారధి.

-సముద్రాల వేణుగోపాలాచార్య

# పృథ్వీ నానీలు

అయ్యో!
పురిటి నొప్పులు ఆమెకి!
ఐతే ఇంకేం?! డబ్బు కుప్పలు
హాస్పిటల్‌కి!

ప్రాణాల వ్యాపారానికి / రాతి గుండె
తెల్లకోటు, స్టెతస్కోపు / అర్హతలు!

పచ్చని చెట్టుని
వెచ్చని మనిషిని
చంపైనా చేసేదే
వ్యాపారం... నేడు!

మానం, ప్రాణం
వ్యాపార వస్తువులైపోయాయి
మానవత్వం
మట్టిగలిసిందా?

హత్యలు
మానభంగాలు
నా బాగ్రౌండ్!
ఐతే నువ్వే రైటు రాజకీయానికి!

అమ్మో! ఇలాగే ఊరుకుంటె
మనసుల్నీ భావాల్నీ కూడా
కబళించేస్తుంది!
కల్తీ!

వాడు పొట్లాలు కట్టి
అమ్ముతున్నదీ...
మంచినీళ్ళేనా?
జబ్బు మూటలా?!

హంస కనిపిస్తే...
అడగాలి!
పాలలో నీళ్ళు వేరుచేస్తావ్!
విషం కలిస్తే...?

వేదన / కన్నుల్లో వరదలౌతున్నా...
మేకప్ ముసుగులో
నవ్వు తెప్పించాలి!

మనసు నరాలు
పగిలితే వెల్లువయేది...
అనల విప్లవమే
కన్నీరు కాదు!

—ఎం.పి. పృథ్వి

నిండినవి. ఈ 45 ఏండ్ల నుండి అదే దినచర్య.

ఒకనాడు చాలా జబ్బుచేసి మంచం పట్టింది. కుమారి ప్రక్కయింటి నాయర్ స్త్రీ ఒకతె వచ్చి పరిచర్య చేస్తూ వున్నది. "అయ్యో! యీ దినము శంకరన్‌కు అన్నము తీసుకు పోలేదే. నీవైనా తీసుకపోవూ? అతడు వచ్చేవేళ అయింది" అన్నది నాయరు స్త్రీతో. కుమారికి రెండవ దినము జబ్బింకా జాస్తి అయినది. ఆమె పవిత్ర వర్తనము, ఆ నిర్మల ప్రేమ, ఆ అఖండ భక్తి, ఆ అపూర్వ విశ్వాసము చూచి ఆమెకు భక్తితో నమస్కరించనివారే ఆ గ్రామంలో లేరు. ఆమెకు రెండు దినాలు చాలా జబ్బైందని వినేవరకు చుట్టుపట్ల వారంతా గుంపైనారు. పగలంతా తీవ్రమైన తాపము, కలువరింతలు. ఆ కలువరింతలు అంతా శంకరన్ గూర్చిన కలవరింతలే.

"ఊహూఁ నీవే ముందు దొర్లిపోవాలె..."

"మనకు పెండ్లయితే యెప్పటిలాగా ఆడు కోమా?..."

"నన్ను మరిచిపోతావా శంకరన్?..."

"లేదు లేదు, నీవు జల్దీ రాకుంటే వట్టు!..."

ఈ ప్రకారము కలవరించుతూ వున్నది.

సాయంత్రమైంది. అందరూ చుట్టూ మూగి ఉపచారాలు చేస్తూ వున్నారు. తటాలున కుమారి ముఖముపైన గొప్ప కాంతి బయలుదేరింది. కండ్లలో ఆనందజ్యోతి ప్రజ్వరిల్లింది. ఎక్కడ లేని బలం వచ్చింది. మంచములో లేచి కూర్చుని దక్షిణ ముఖంగా చూస్తూ చేతులు చాచి కుమారి

"ఆఁ వచ్చితివా, శంకరన్! జల్దీ వస్తానంటివే! యిప్పుడైనా నన్ను మరచిపోలేదు కదా! నన్నూ రమ్మంటివా? వస్తా, వస్తా, యిదిగో వస్తున్నాను, వస్తున్నాను శంకరన్..."

అని మంచము మీద పడిపోయింది అంతా నిశ్శబ్దం. చూచేవరకు కుమారి శరీరం చల్లబడింది, కండ్లు మూసుకున్నది. ముఖముపైన చిరునవ్వు మాత్రము అట్లే నిలిచిపోయింది.

గ్రామస్థులంతా, సర్వవర్ణముల వారు ఆమెను శంకరన్‌తో కడసారి వీడ్కోలు పొందిన స్థలములో సమాధి చేసినారు. అచ్చటనే ఒక గుడి కట్టినారు. అందులో అఖండ ప్రేమజ్యోతి వెలిగించారు. నేటికీ కన్యాకుమారి దేవతయై ఆచోట పూజలు పొందుతూ వున్నది. "నిన్ను పూలల్లో పెట్టి పూజిస్తాను. అందరిచేత పూజ చేయిస్తాను" అన్న శంకరన్ మాటలు నిజమైనవి! ■